# అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఆశీర్వదించండి



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- పగటివేషగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దు
- రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి
- రేగులపల్లిలో ప్రజా ఆశీర్వాద సభ

బెజ్జంకి, అక్టోబర్ 18 : రాష్ట్రంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని రేగులపల్లిలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేగులపల్లి గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. గ్రామంలో నూతన గ్రామపంచాయతీ, మహిళా సమాఖ్య భవనం, సీసీ రోడ్లు, తారు రోడ్డు, అన్ని కుల సంఘాలకు భవనాలు నిర్మించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని, ఎన్నికల సమయంలో వచ్చే పగటివేషగాళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ గ్యారంటీగా గెలువదనే గ్యారంటీ కార్డుల పేరుతో ఇంటింటికీ వచ్చి ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. 50 ఏండ్లలో చెయ్యనోళ్లు.. ఇప్పుడు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని, వారి కుట్రలను పసిగట్టి తరిమికొట్టాలన్నారు. మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం దేశం అబ్బురపడే విధంగా ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు అందిస్తున్నదన్నారు. ఏ ఒక్క ఆడబిడ్డ బిందె పట్టుకొని నీటి కోసం బయటకుపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్‌భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నదన్నారు. అంతేకాకుండా రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్, సరిపడా ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు పంట రుణమాఫీ చేసిందన్నారు. పేదింటి ఆడబిడ్డల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గర్భిణులు, చిన్నారుల కోసం పౌష్టికాహారం, ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం, కేసీఆర్ కిట్టు, మనఊరు –మనబడి కార్యక్రమం ద్వారా నాణ్యమైన విద్య అందజేస్తున్నదని చెప్పారు. కులవృత్తుల అభ్యున్నతికి రూ.లక్ష ప్రోత్సాహం, దళితబంధు, నిరుపేద కుటుంబాలకు గృహలక్ష్మి పథకంలో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.3 వేల భృతి, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం, రూ.5 లక్షల బీమా, రూ.400కే సిలిండర్, రైతుబంధు, ఆసరా పింఛన్లు, అగ్రవర్ణ పేదలకు గురుకులాలు, అసైన్డ్ భూములపై ఆంక్షల ఎత్తివేత వంటి అనేక పథకాలను అమలు చేయనున్నట్లు వివరించారు. ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీజేపీ, కాంగ్రెస్ నుంచి భారీ సంఖ్యలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు డప్పుచప్పుళ్ల మధ్య ఘనస్వాగతం పలికారు. సభలో ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చంద్రకళ, సర్పంచ్ జెల్లా ఐలయ్య, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజామహేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకరయ్య నేత్రాలను సేకరిస్తున్న ఎల్వీ ప్రసాద్ దవాఖాన వైద్యులు

## మున్సిపల్ మాజీ కమిషనర్ శంకరయ్య మృతి

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 18 : మున్సిపల్ మాజీ కమిషనర్ గుండోజు శంకరయ్య(81) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. హుస్నాబాద్‌కు చెందిన శంకరయ్య పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఎల్‌డీసీ నుంచి ఈవోగా పనిచేశారు. నేటి పెద్దపల్లి జిల్లా రామగుండంలో మున్సిపల్ మేనేజర్, కమిషనర్, జనగామ జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్, వరంగల్ రీజినల్ డైరెక్టర్‌గా ఆయన సేవలందించారు. హుస్నాబాద్ ప్రధాన రహదారిని 40 ఏండ్ల కిందటే వంద ఫీట్ల రహదారి ఉండే విధంగా అనుమతులు ఇచ్చారు. శంకరయ్య ఉద్యోగ విరమణ తర్వాత సాహిత్యరంగంలో తన సేవలను అందించడమే కాకుండా స్ఫూర్తి అసోసియేషన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన మృతికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అనిత, స్ఫూర్తి అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిల్ల శంకర్, తెలంగాణ అవయవదాతల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు రాజమల్లయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

**శంకరయ్య నేత్రాలు సజీవం...**

మున్సిపల్ మాజీ కమిషనర్ శంకరయ్య మరణాంతరం తన నేత్రాలను అందించి మరో ఇద్దరి జీవితానికి వెలుగు నింపాడు. తెలంగాణ శరీర అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులను సంప్రదించగా, వారు నేత్రాలను ఇచ్చేందుకు అంగీకరించారు. వరంగల్ ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన సిబ్బంది శంకరయ్య నేత్రాలను సేకరించారు.

## వ్యక్తిపై కేసు నమోదు

అక్కన్నపేట, అక్టోబర్ 18 : హుస్నాబాద్ మండలం వంగరామయ్యపల్లి పరిధిలోని పూల్‌నాయక్ తండాకు చెందిన బొడ రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం కేశవాపూర్ వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పూల్‌నాయక్ తండాకు చెందిన రవీందర్ తన ద్విచక్ర వాహనంపై ఐదు లీటర్ల నాటుసారా రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నాటుసారాను స్వాధీనం చేసుకొని రవీందర్‌పై కేసు నమోదు చేశారు.

## కొమురవెల్లి 'మల్లన్న'కు ముడుపు

చేర్యాల, అక్టోబర్ 18 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధించాలని కోరుతూ బుధవారం కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ యువజన విభాగం, బీఆర్ఎస్వీ, సోషల్ మీడియా విభాగాల ఆధ్వర్యంలో నాయకులు కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ముడుపు కట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించాలని, బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని మల్లన్నను వేడుకున్నారు. అనంతరం విలేకరులతో నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టే బాధ్యత బీఆర్ఎస్‌వై, బీఆర్ఎస్వీ, సోషల్ మీడియా వర్గాల సభ్యులదేనన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల సభ్యులు పాల్గొన్నారు.



మల్లన్న ఆలయంలో ముడుపు కట్టిన బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్ నాయకులకు పసుపు, కుంకుమ అందజేస్తున్న ఉల్లెంగల పద్మాఏకానందం దంపతులు

## బీఆర్ఎస్ విజయం సాధించాలని పూజలు

చేర్యాల, అక్టోబర్ 18 : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని కోరుతూ బుధవారం మండలంలోని ఆకునూరు గ్రామ భవానీ రుద్రేశ్వరిస్వామి ఆలయంలో మండలంలోని 18 గ్రామాల బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భవానీ అమ్మవారితోపాటు రుద్రేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధించి సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాలని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులకు ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉల్లెంగల ఏకానందం, తిమ్మాపూర్ మాజీ జడ్పీటీసీ ఉల్లెంగల పద్మ అమ్మవారి పసుపు, కుంకుమ అందజేశారు. కార్యక్రమంలో గ్రామశాఖల అధ్యక్షులు పాల బాలరాజు, బీమా రాజు, పొన్న సిద్ధులు, ఏఎంసీ డైరెక్టర్ తాటికొండ సదానందం, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు



మద్దూరు : గాగిల్లాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 18 : తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం అందజేసిన బతుకమ్మ చీరలు కట్టుకొని పల్లెపల్లెనా అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు మురిపెంగా బతుకమ్మ ఆటలు ఆడుతున్నారు. మద్దూరు మండలం గాగిల్లాపూర్‌లో మహిళలంతా ఒకే రకమైన బతుకమ్మ చీరలు కట్టుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పుట్టింటి వాళ్లు అందించిన సారెలాగా ఏటా సీఎం కేసీఆర్ బతుకమ్మ పండుగకు చీరలు అందించి ఆడబిడ్డలను గౌరవిస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు.

**హుస్నాబాద్‌లో..**

హుస్నాబాద్, అక్టోబర్ 18 : హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆనందంగా గడిపారు. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పూవులను దేవతగా భావించి జరుపుకొనే గొప్ప పండుగ బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దామెర కరుణాకర్, అధ్యాపకులు రవీందర్, సదానందం, లక్ష్మయ్య, కవిత, స్వరూప, సంపత్, నిర్మలాదేవి, రాజేంద్రప్రసాద్, భాగ్యలక్ష్మి, రాములు, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

**హుస్నాబాద్ ఆర్డీవో బెన్ షాలోమ్**

హుస్నాబాద్, అక్టోబర్ 18 : అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణ, నిబంధనలపై రాజకీయ పార్టీల నాయకులు అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో బెన్ షాలోమ్ సూచించారు. బుధవారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, ఇందులో ఫిర్యాదులు, సలహాలు, సూచనలు చేయవచ్చన్నారు. ప్రతిఒక్కరూ విధిగా ఓటు వేసేలా ఓటర్లను చైతన్యం చేయడంలో నాయకులు భాగస్వాములు కావాలని కోరారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను మభ్యపెడుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాల ఫోన్ నంబర్లు కూడా అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ఎన్నికల నిబంధనలు, ఓటు వేసే పద్ధతి, అక్రమాలు జరిగినప్పుడు ఎలా ఫిర్యాదు చేయాలో తెలియజేసే వాల్ పోస్టర్‌ను ఆర్డీవో ఆవిష్కరించారు.

**ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వాలి..**

హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన పీవో, ఏపీవో, ఓపీవోలకు విస్తృత స్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆర్డీవో బెన్ షాలోమ్ అధికారులకు సూచించారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు బుధవారం ఆర్డీవో బెన్ షాలోమ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి అధికారికి శిక్షణ ఇవ్వాలని మాస్టర్ ట్రైనర్స్‌కు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పీవో, ఏపీవో, ఓపీవోలు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డీఏవో అహ్మద్‌ఖాన్, తహసీల్దార్లు రవీందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, మాస్టర్ ట్రైనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బెన్ షాలోమ్